క్లుప్తంగా

మామిడి తోటలపై ఏనుగుల దాడి



ఏనుగులు విరిచేసిన మామిడి కొమ్మలు

సదుం: మండలంలో తాటిగుంటపాలెం పంచాయతీ చింతలవారిపల్లె సమీపంలోని మామిడి తోటలపై ఏనుగులు సోమవారం వేకువజామున దాడి చేశాయి. దేవేంద్రరెడ్డి, రమణ, శ్రీరాములు, నారాయణ రెడ్డికి చెందిన తోటల్లో చెట్ల కొమ్మలను విరిచి వేయడంతో పాటు కాయలు నేలపాలై నష్టం వాటిల్లింది. అంతంత మాత్రంగా ఉన్న మామిడి దిగుబడి ఏనుగుల ధాటికి అది కూడా మిగల్లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వైభవంగా బాటగంగమ్మ జాతర



విశేష అలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లి: మండలంలోని పాతపేటలో బాటగంగమ్మ జాతర సోమవారం అంగరంగవైభవంగా ప్రారంభమైంది. ఉదయం ఆలయంలో అమ్మవారికి పసుపునీళ్లు, పాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఏటా ఆనవాయితీగా వస్తున్న బాటగంగమ్మ జాతరకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. జయమ్మ, మునిస్వామిశెట్టి ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వి.కోటలో..



ప్రత్యేక అలంకరణలో గంగమాంబ

వి.కోట: పట్టణంలోని శ్రీ గంగమాంబ జాతర సోమవారం ఘనంగా మొదలైంది. గంగమాంబ అమ్మవారి శిరస్సు, పూలగెరిగ, అమ్మవారిని పుష్పపల్లకిపై కొలువుతీర్చి పట్టణంలో ఊరేగించారు. ఆదివారం అంకురార్పణంతో ప్రారంభమై సోమవారం పూలగెరిగ, పుష్పపల్లకి, బాణ వేడుకలు నిర్వహించారు. అలాగే మంగళవారం ఉదయం అగ్నిగుండ ప్రవేశం, అమ్మవారి అభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త తెలిపారు. అనంతరం రాత్రి 12 గంటలకు వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కందుకూరికి ఘన నివాళి



కందుకూరికి నివాళులర్పిస్తున్న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు

పలమనేరు: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి పురస్కరించుకుని సోమవారం స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో స్థానిక కళామందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు మాట్లాడుతూ, వితంతు వివాహాలు, బాలికల విద్యకు ఆయన ఎనలేని సేవలు శ్లాఘనీయమని స్మరించారు. ఆంధ్రరాష్ట్రంలో బ్రహ్మ సమాజాన్ని స్థాపించడంతో పాటు సమాజసేవ కోసం హితకారిణి సమాజాన్ని ప్రారంభించి దానికోసం తన యావదాస్థిని దానం చేసిన నవయుగ వైతాళికులు కందుకూరి అన్నారు. సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలను రూపుమాపేందుకు వివేకవర్ధిని అనే పత్రికను స్థాపించిన ఘనుడు కందుకూరి అన్నారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి పుష్ప, జేఎస్‌సీ మూర్తి, గిరిధరమూర్తి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



వజ్రాలపురంలో కలశపూజ

భూమాతను కాపాడుకుందాం..

- రసాయనిక ఎరువులతో నిస్సారమవుతున్న భూములు
- భూముల్లో భారీగా తగ్గిన సేంద్రియ కర్బనం
- భూసారాన్ని రక్షించుకోకుంటే భవిష్యత్తులో ముప్పే
- ప్రకృతి వ్యవసాయమే ఉత్తమం



మొరంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు

పలమనేరు: మనిషి తన ఆరోగ్య సంరక్షణకు ఎంత ప్రాధాన్యత ఇస్తాడో అలాగే భూమాత ఆరోగ్యంపై రైతాంగం ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంటోందని ప్రస్తుత భూసార పరీక్షలు రాబోవు ఉపద్రవాన్ని హెచ్చరిస్తున్నాయి. పంటల సాగులో రైతులు విచక్షణారహితంగా వినియోగిస్తున్న రసాయనిక ఎరువుల మూలాన భూమి తన సహజత్వాన్ని కోల్పోతోందని, జిల్లాలోని సాగు భూముల్లో నత్రజని (సేంద్రియ కర్బనం) భారీగా తగ్గిందనే చేదు నిజం భూసార పరీక్షల్లో తేటతెల్లమైంది. వ్యవసాయ విధానాల్లో మార్పులు పాటించకపోతే కొన్నేళ్లలో సాగు భూములు నిస్సారంగా మారి, చౌడు భూములుగా మారే ప్రమాదం పొంచి ఉంది. ప్రకృతి వ్యవసాయం విధానాలు పాటించి రైతులు భూమాత ఆరోగ్య పరిరక్షణకు దృష్టి సారించేలా వ్యవసాయశాఖ నడుం బిగించింది.

తగ్గిన సేంద్రియ కర్బనం

జిల్లాలో 64 శాతం మంది ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. ఇప్పటికే పారిశ్రామికీకరణ, గ్లోబల్ వార్మింగ్ ప్రభావం పడి, భూమిలోని పోషకాలు, సూక్ష్మధాతువులు తగ్గి పంటలపై పడింది. జిల్లాలో వర్షాధారిత పంటలుగా వేరుశనగ, రాగి, జొన్న, కంది తదితర పప్పుధాన్యలతో పాటు నూనె గింజలను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. మిగిలిన భూముల్లో పలు రకాల కూరగాయల పంటలతో పాటు వరి, పండ్ల తోటలను సాగు చేస్తున్నారు. గత ఏడాది తిరుపతి, కుప్పంలోని ప్రభుత్వ భూసార పరీక్ష కేంద్రాలు జిల్లాలోని పలు మండలాల్లో రైతుల భూములకు సంబంధించి భూసార పరీక్షలు చేశారు. వీటి ఫలితాలను చూసి అధికారులు భూసారం కోల్పోతోందని గుర్తించారు. మామూలుగా భూమి సారవంతంగా ఉండాలంటే ముఖ్య పోషక పదార్థాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ సమ పాళల్లో ఉండాలి. అయితే ఇక్కడి భూముల్లో నత్రజని 60 శాతం భూముల్లో తక్కువగా, 20 శాతం భూముల్లో మాధ్యమికంగా, మూడు శాతం భూముల్లో హెచ్చుగా ఉందని తేలింది. సేంద్రియ కర్బనం స్థాయి తగ్గింది. జింకు 1.5 శాతంగా ఉండాలి అయితే జిల్లాలోని భూముల్లో పాయింట్ 5 శాతంగా ఉంది. ఇది తక్కువగా ఉండడం కూడా ఇబ్బందే. ఇక ఉదజని సూచిక పాయింట్ 75గా ఉండాలి కానీ ఇది పెరిగింది. దీంతో భూముల్లో క్షారత పెరిగి భూమి బెట్టను తట్టుకోక పైర్లు త్వరగా ఎండి పంట దిగుబడులు తగ్గుతాయి. లవణ సూచిక 0.25 శాతం లోపల ఉండాలి. కానీ పొలాల్లో 0.40గా ఉంది. దీంతో ఫ్లోరైడ్ పెరిగి భూసారాన్ని మొక్క గ్రహించలేని స్థితికి చేరినట్లే.

భూములు కాపాడుకోవాలంటే..

- యూరియాను మోతాదుకు మించి పంటలకు వాడరాదు
- పచ్చరొట్ట ఎరువులైన జీలుగ, జమ్ము, ప్రెస్‌మడ్‌లను వాడాలి
- భూసారాన్ని కోల్పోకుండా నేలకోతలను అరికట్టాలి
- భూమిలో తేమ పరిరక్షణకు కృషిచేయాలి
- వర్షపు నీరు పొలాల్లోనే ఇంకేలా చూడాలి
- సేంద్రియ ఎరువులను విరివిగా వాడాలి
- పంటమార్పిడి విధానం విధిగా పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ

- భూమిని లోతుగా వాలుకు అడ్డంగా దున్నుకోవాలి

ప్రకృతి వ్యవసాయమే ప్రత్యామ్నాయం

పాత పద్ధతులతో వ్యవసాయం చేసిన మన పెద్దలు మంచి దిగుబడులతో పాటు నాలుగు కాలాలపాటు భూములు సారవంతంగా పెట్టుకున్నారు. రాన్రాను అధిక దిగుబడుల కోసం రైతులు రసాయనిక ఎరువుల వాడకం, మోతాదుకు మించిన క్రిమి సంహారక మందులు వాడటం వల్ల భూసారం కోల్పోవడానికి దారితీసింది. దీంతో మళ్లీ ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారు. చేలకు పశువుల ఎరువులు వేయడం, విత్తనశుద్ధి, కషాయాలను, జీవామృతం, బీజామృతం, ఘనజీవామృతం, నీమాస్త్రం ..మొదలైన వాటిని తయారు చేసి పంటలకు వినియోగిస్తున్నారు. ఫలితంగా ఆరోగ్యకరమైన దిగుబడులు పెరిగాయని రైతులు చెబుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు



మాది విజయనగరం జిల్లా. నేను కొన్నేళ్లుగా ఈ జిల్లాలో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌గా పనిచేస్తూ జీరో బేస్డ్ నేచురల్ ఫార్మింగ్‌ను రైతులకు నేర్పుతున్నా. ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో ఈ పద్ధతి ద్వారా మంచి ఫలితాలను సాధించాం. ప్రస్తుతం పలమనేరు ప్రాంతంలో ఈ విధానాన్ని అమలు చేస్తున్నాం, దీనివైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. – లత, సీఆర్‌పీ, జెడ్‌బీఎన్‌ఎఫ్, పలమనేరు

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



విపరీతంగా రసాయనిక ఎరువులను వాడకంతోనే భూములు సారాన్ని కోల్పోయాయి. దీంతో పంటలు సరిగ్గా పండడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. చాలామంది రైతులు ఇప్పుడు సహజ పద్ధతుల్లో వ్యవసాయం చేసేందుకు అలవాటు పడుతున్నారు. – సంధ్య, వ్యవసాయాధికారిణి, పలమనేరు

ఎన్నికల సంబరాలు నిషేధం

- అవగాహన ఉన్నవారినే కౌంటింగ్‌కు ఏజెంట్లుగా నియమించండి
- రాజకీయ పార్టీలతో ఎన్నికల అధికారి శ్రీనివాసులు



రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఆర్‌ఓ శ్రీనివాసులు

కుప్పం: ఎన్నికలపై వివిధ సర్వేలు విడుదల చేస్తున్న ఫలితాలపై రాజకీయ పార్టీలు ఎంతమాత్రమూ సంబరాలు నిర్వహించరాదని ఎన్నికల కమిషన్ నిషేధం విధించిందని రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులకు ఓట్ల లెక్కింపు విషయమై అవగాహన కల్పించారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు జూన్ 4న కౌంటింగ్ కోసం అవగాహన ఉన్న వారినే ఏజెంట్లుగా నియమించుకోవాలన్నారు. జూన్ 1న వివిధ సంస్థల సర్వే ఫలితాలు, ఎగ్జిట్ పోల్స్‌పై రాజకీయ పార్టీలు బాణసంచా పేల్చడం , కేక్‌లు కట్ చేయడం, ర్యాలీలు వంటి సంబరాలను ఎన్నికల కమిషన్ నిషేధించిందన్నారు. ఏ రాజకీయ పార్టీ గెలిచినా జూన్ 9వ తేదీ వరకు వరకు సంబరాలు చేయరాదని ఆదేశించారు. కుప్పం నియోజకవర్గంలో ఒకటిన్నర నెలగా ఎన్నికల నిర్వహణకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీలు వారం రోజులు ఎన్నికల నిబంధనలు పాటించాలని, ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్‌కు సహకరించాలని ఆయన కోరారు.

పుష్పపల్లకి



విద్యుత్‌దీపాల శోభతో కాంతులీనుతున్న స్వామి వారి పల్లకి

బైరెడ్డిపల్లి: మండలంలోని పట్నపల్లె కొండపై ఉన్న శ్రీ కళ్యాణవెంకట్రమణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి వైభవంగా పుష్పపల్లకి నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.. విద్యుత్‌దీపాలు, పుష్పాలతో అలంకరించిన పల్లకిపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకట్రమణస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. బేలుపల్లె నుంచి మేళతాళాలు, మంగవాయిద్యాల హోరు, బాణసంచా మోత నడుమ సోమవారం ఉదయం ఆలయం వద్ద ప్రదక్షిణలు చేశారు. మండలం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల భక్తులు సైతం అధిక సంఖ్యలోస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం జనసందోహంతో కిక్కిరిసింది. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ కృష్ణమోహన్, ఎస్‌ఐ క్రిష్ణయ్య బందోబస్తు నిర్వహించారు.



పల్లకిపై కొలువు దీరిన ఉత్సవమూర్తులు

స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ లేకపోతే సీజ్ చేస్తాం

- ఎంవీఐ సుప్రియ



పుంగనూరులో స్కూల్ బస్సును నడిపి తనిఖీ చేస్తున్న ఎంవీఐ సుప్రియ

పుంగనూరు: పాఠశాలలు, కళాశాలల బస్సులు, వ్యాన్లకు విధిగా ఫిట్‌నెస్ టెస్ట్ చేయించుకుని సర్టిఫికెట్ పొందాలని లేనిపక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని ఎంవీఐ సుప్రియ హెచ్చరించారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. పుంగనూరు ఆర్టీఏ పరిధిలో మొత్తం 44 బస్సులు ఉన్నాయన్నారు. డీటీసీ నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు బస్సులు, వ్యాన్లు , ఎఫ్‌సీ, పర్మిట్లు , ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లతో పాటు డ్రైవర్లకు లైసెన్సులు కచ్చితంగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు 24 బస్సులకు ఎఫ్‌సీ చేశామన్నారు.పాఠశాలలు , కళాశాలలు తెరిచేలోపు మిగిలిన వాహనాలకు ఎఫ్‌సీ చేసేందుకు యాజమాన్యాలు తీసుకురావాలన్నారు. లేకపోతే వాహనాలను రోడ్డుపై అనుమతించే ప్రసక్తే లేదన్నారు. అలాగే పన్ను బకాయిదారులు తక్షణమే చెల్లించాలన్నారు. ముఖ్యంగా మైనర్లు రోడ్డుపై వాహనాలను నడిపితే సీజ్ చేసి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రహదారి భద్రత, సూచనలను పాటిస్తూ ప్రతి ఒక్కరు ప్రయాణించాలని కోరారు.

మట్టి డంపింగ్ కేంద్రాలపై దాడులు

సాక్షి ఎఫెక్ట్..



మట్టితో ఇసుక తయారీ!

గుడుపల్లె: అక్రమంగా ఇసుక తయారు చేసి తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ లక్ష్మీకాంత్ హెచ్చరించారు. సోమవారం సాక్షి దినపత్రికలో 'మట్టితో ఇసుక తయారీ' శీర్షికతో ప్రచురించిన కథనంపై ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, వీఆర్వోలు స్పందించి ఇసుక తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. నిల్వ ఉన్న మట్టిని ఖాళీ చేయాలని ఇసుకాసురులను ఆదేశించారు. చెరువుల నుంచి మట్టిని తీసి డంపింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు రోజుల్లో నోటీసులు జారీ చేస్తామన్నారు. ప్రభుత్వం అనుమతి లేకుండా ఇసుక తయారు చేసినా, అక్రమంగా ఇసుక రవాణా చేసినా కేసులు నయోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేస్తామని ఎస్‌ఐ చెప్పారు.

కూలే స్థితిలో విద్యుత్ స్తంభం



పుంగనూరు: పట్టణంలోని పీఎల్ ఆర్ మినీ బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం కూలిపోయే స్థితిలో ప్రమాదానికి తావిచ్చేలా ఉంది. గుర్తు తెలియని వాహనం మంజునాథ కల్యాణ మండపం సర్కిల్‌లో ఢీకొనడంతో ఇనుప స్తంభం పూర్తిగా వంగి పడిపోయేలా ఉంటోంది. దీనిని కమిషనర్ నరసింహప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా.. తక్షణం మరమ్మతులు చేయిస్తామని, అవసరమైతే స్తంభాన్ని తొలగిస్తామని స్పందించారు.

వజ్రాలపురం గంగమ్మ జాతర ప్రారంభం

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురంలో వెలసిన శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మ 25వ జాతర మహోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలను నిర్వహించారు. అనంతరం కలశ స్థాపన, ధ్వజారోహణ, గణపతి హోమం, చండీయాగ కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తి సంకీర్తనలు, కోలాట, భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, దీప, గోపి, చాతుర్య, పురుషోత్తం, మమత, ఈశ్వర్‌నాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. మంగళవారం అమ్మ వారికి అంబలి, పొంగళ్లను సమర్పించనున్నారు. అనంతరం అమ్మ నిజరూప దర్శనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ మొగిలప్ప, నిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హోమ కార్యక్రమంలో భక్తులు

వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం తథ్యం



పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- మళ్లీ జగనన్నే సీఎం
- పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: ఎవరెన్ని మాట్లాడినా, టీడీపీ వాళ్లు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా, తామే అధికారంలోకి వచ్చేదంటూ డాంబికాలు పలుకుతున్నా విజయం మాత్రం వైఎస్సార్‌సీపీదేనని, పలమనేరులోనే కాదు..రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని, మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ధీమాగా చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ నాయకులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో తాను ఇంటింటికీ వెళ్లి, ప్రజల కష్టాలు, సమస్యలను తెలుసుకుని పరిష్కరించానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అర్హులకు అందించామని తెలిపారు. తాము చేసిన మంచి, మేలును గమనించిన ప్రజలు పార్టీలకతీతంగా వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారనే నమ్మకం తనకు ఉందన్నారు. చంద్రబాబు మాయమాటలను జనం ఎవరూ నమ్మడం లేదన్నారు. సమావేశంలో పట్టణ కన్వీనర్ జాఫర్, మాజీ కన్వీనర్ మండీసుధా, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుల్జార్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



పెద్దపంజాణి: సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేగౌడ

పెద్దపంజాణి: జూన్ 4న వెలువడనున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలలో పలమనేరు నియోజక వర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేయడం ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్. వెంకటేగౌడ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల అనంతరం సోమవారం మండలంలోని వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులతో లింగాపురం వద్ద ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. టీడీపీ, జనసేన నాయకులు ఎన్ని కుయుక్తులు చేసినా ఎన్నికల ఫలితాల తర్వాత తెరమరుగు కావడం తప్పదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో మరోసారి జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ప్రమాణం చేస్తారని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీని ఆదరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



బాలసుందరం రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



పెద్దపంజాణి: మృతురాలి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెంకటేగౌడ

పలమనేరు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యులు బాలసుందరం రెడ్డి కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే వెంకటేగౌడ పరామర్శించారు. పట్టణంలోని మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బాలసుందరం రెడ్డి మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన లేనిలోటు పార్టీలో పూడ్చలేమని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములురెడ్డి, చంద్రప్ప, గిరిరాజారెడ్డి, క్రిష్ణమూర్తి రెడ్డి, చలపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: పెద్దపంజాణికి చెందిన పార్టీ నాయకుడు ద్వారకనాథరెడ్డి కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే వెంకటేగౌడ పరామర్శించారు. మూడు రోజుల క్రితం ద్వారకనాథరెడ్డి సతీమణి అన్నపూర్ణ మరణించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పరామర్శించారు. మృతురాలి చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, సింగిల్‌విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆంజమ్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సలహాదారు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బాగారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు హరినాథ్, జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, మాకయ్య తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్





మోడల్ కాలనీలో ఓ ఇంటిలో తనిఖీ చేస్తున్న పోలీసులు, మోడల్ కాలనీలో పోలీసులు

- పోలీసుల తనిఖీలతో హడల్
- అనుమానితులపై పోలీసుల నిఘా

కుప్పం: మూడు రాష్ట్రాల కూడలి ప్రాంతమైనా కుప్పంలో పోలీసులు అనుమానితులు, కొత్తవారి సంచారంపై నిఘా పెంచారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణ సమీపంలోని మోడల్ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు కాలనీలో కొత్తవారి సంచారంపై ఆరా తీశారు. ప్రతి ఇంటింటిలో ఉన్న వాహనాలను, వాటికి సంబంధించి రికార్డులు ఉన్నాయా, లేవా? అని పరిశీలించారు. కర్ణాటక, తమిళనాడు సంబంధిత రిజిస్ట్రేషన్ వాహనాలు అధికంగా ఉండటంతో వాటి రికార్డులు, ఈ వాహనాలతో కాలనీకి వచ్చిన వారి వివరాలు సేకరించారు. కొన్ని వాహనాలు అనుమానాస్పదంగా ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాటి రికార్డులు చూపి తీసుకెళ్లవచ్చని అక్కడి వారికి కుప్పం అర్బన్ ఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఎక్కడైనా అనుమానితులు, కొత్తవారి సంచారం ఉన్న పక్షంలో తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తనిఖీలతో బెంబేలెత్తిన ప్రజలు

రాత్రి గాఢ నిద్రలో ఉన్న సమయంలో పోలీసులు మోడల్ కాలనీలోని గృహాలలో పోలీసులకు తనిఖీలు చేయడంతో స్థానికులు బెంబేలెత్తారు. ఉదయం వరకూ సోదాలు కొనసాగడంతో హడలిపోయారు. 25 ఏళ్లలో ఎప్పుడూ లేనివిధంగా ఇలా చేయడం, పైగా తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా బయట ప్రాంతాల నుంచి బంధువులు వచ్చి ఉన్నప్పుడు సోదాలు చేయడం ఎంతమాత్రమూ తగదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

పలమనేరులో పోలీసుల కవాతు



కవాతు చేస్తున్న పోలీసులు

పలమనేరు: మున్సిపాలిటీలోని గంటావూరు, గొబ్బిళ్ల కోటూరులో ఎస్పీ వీఎన్ మణికంఠ ఆదేశాల మేరకు డీఎస్పీ విష్ణురఘువీర్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. పలమనేరు, గంగవరం సీఐలు చంద్రశేఖర్, చినగోవింద్ మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఉండేందుకు కవాతు చేసినట్టు చెప్పారు. ఇప్పటికే పట్టణంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టులు అమలులో ఉన్నాయన్నారు. కౌంటింగ్‌రోజు గెలిచిన వారు లేదా ఓడినవారు ఎవరైనా రోడ్లపైకి వస్తే గుంపులు వచ్చినా, సంబరాలు చేసినా, టపాసులు కాల్చినా కేసులు తప్పవన్నారు. రాజకీయ పార్టీలు పోలీసులకు సహకరించాలని కోరారు.

భగవద్గీతపై ప్రచారం



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

సదుం: భగవద్గీతపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు జి.ప్రసాద్ అన్నారు. మండలంలోని పాలమంద చెరువు ముందరపల్లె, పెద్దూరు, కురవపల్లె, గాండ్లవారిపల్లె, బల్లావారిపల్లె, కంభంవారిపల్లె, రెడ్డివారిపల్లె, ఎగువపల్లె గ్రామాల్లో సోమవారం ఆయన భగవద్గీతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలన్నారు. దీని వలన మంచి మార్గంలో నడిచేందుకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఆత్మ, జీవాత్మ, పరమాత్మ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సభ్యులు పెంచల రత్నం, మహేంద్ర, మధు, వెంకటసుబ్బమ్మ, రత్నమ్మ, రవణయ్య, రమణమ్మ, మల్లీశ్వరి, మధుప్రియ తదితరులు పాల్గొన్నారు.